క్లుప్తంగా

పచ్చిరొట్ట పైర్లు సాగు చేయాలి



మాట్లాడుతున్న ఏడీఏ బాలాజీనాయక్

దర్శి: భూముల్లో తక్కువగా ఉన్న సేంద్రియ లోపాన్ని అధిగమించేందుకు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్ సూచించారు. మండలంలోని పసుపుగల్లులో పంటలు పరిశీలించి భూసార పరీక్షలు ఆధారంగా అవలంభించాల్సిన పద్ధతుల గురించి రైతులకు గురువారం అవగాహన కల్పించారు. బాలాజీనాయక్ మాట్లాడుతూ ప్రతి రైతు తన వంతుగా పచ్చిరొట్ట పైరులు సాగు చేసి కలియదున్నడం లేదా పశువుల ఎరువులను భూమిలో కలపడం ద్వారా భూసారం పెంపొందించుకోవాలన్నారు. వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ మాట్లాడుతూ భూసార పరీక్షలు, మట్టి నమూనాలు ఖాళీగా ఉన్న సమయంలో మాత్రమే తీయాలన్నారు. ఎరువులు వేసిన నెల తర్వాత కూడా తీయవచ్చని చెప్పారు. పొలం గట్ల వద్ద, చెట్ల నీడలో మట్టి నమూనాలు సేకరించవద్దని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా జింక్, జిప్సం, బోరాన్‌ను రైతులకు రాయితీపై అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

నేటి శాంతి ర్యాలీని విజయవంతం చేయాలి

దర్శి: ప్రముఖ క్రైస్తవ బోధకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతికి నిరసనగా దర్శి రీజియన్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు గల్లెపోగు ఏసుదాసు, దర్శి మండల అధ్యక్షుడు బెజవాడ అనిల్‌కుమార్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీలోని క్రిస్టియన్ పాలెం నుంచి ర్యాలీ బయల్దేరి ఎంపీడీఓ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం, గడియారం స్తంభం సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పాస్టర్స్ అసోసియేషన్లు, పాస్టర్ సంఘ కాపరులు, సువార్తికులు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొబ్బరి చిప్పల సేకరణ హక్కుకు వేలం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

తాళ్లూరు: వచ్చే నెల 14న గుంటి గంగ భవాని అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా కొబ్బరి చిప్పల పోగు చేసుకునే హక్కు కోసం గురువారం ఆలయంలో వేలం పాట నిర్వహించారు. దేవదాయ శాఖ కందుకూరు డివిజన్ ఆఫీసర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ తిరునాళ్ల జరిగే రెండు రోజులు అంటే 13వ తేదీ మధ్యాహ్నం నుంచి 15వ తేదీ మధ్యాహ్నం వరకు తిరునాళ్ల పాట గత సంవత్సరం రూ.1.54 లక్షలుగా పాడుకోగా ఈ సంవత్సరం రూ.3.06 లక్షలకు పాటదారులు దక్కించుకున్నారు. గుంటపల్లి వాసు, ఆలయ చైర్మన్ గురుబ్రహ్మం, ఆర్‌వీకే ప్రసాద్ రావు, పాటదారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్

గిద్దలూరు రూరల్: ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న ఇసుక టిప్పర్ ఢీకొట్టిన సంఘటన గిద్దలూరు మండలంలోని శింగంపల్లె వద్ద గురువారం చోటుచేసుకుంది. గిద్దలూరు డిపో నుంచి ప్రయాణికులతో బయలుదేరిన ఆర్టీసీ బస్సును మార్గమధ్యంలో శింగంపల్లె వద్ద ఇసుక లోడుతో వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదం నుంచి అదృష్టవశాత్తు ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. కాగా, ప్రమాదం ధాటికి బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది.

31న జార్జి ఫార్మసి కాలేజ్‌లో క్యాంపస్ డ్రైవ్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

మార్కాపురం: ఈనెల 31న మార్కాపురం పట్టణంలోని జార్జి ఫార్మసి కళాశాలలో దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ తెలిపారు. గురువారం క్యాంపస్ డ్రైవ్ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. 2021 నుంచి 2024 మధ్య ఉత్తీర్ణులైన బీ ఫార్మసి, ఎం ఫార్మసి, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్ఎస్సీ, బీటెక్ విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్‌లో పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.రాజా జయరావు, డీన్ డాక్టర్ సునీత, డాక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



గుడిపాడు ఓ ఇంట్లో నిల్వ ఉన్న కందులు

దిగుబడి లేదు.. ధర లేదు!

● ఇళ్లల్లోనే కంది నిల్వలు

దొనకొండ: రైతులు ఆరుగాలం శ్రమించి వ్యవసాయం చేసినా ఆశించిన ఫలితాలు ఉండటం లేదు. సరైన దిగుబడి రాక ఇబ్బందులు పడుతున్న రైతులు పండించుకున్న పంటలకు మద్దతు ధర లేకపోవటంతో వారు ఆందోళన చెందుతున్నారు. పండించిన కంది పంటను ఇళ్లల్లోనే నిల్వ చేసుకున్నారు. మండలంలో సుమారు 7,650 ఎకరాల్లో కంది పంట సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అంచనా. రుద్రసముద్రం, భూమనపల్లి, మంగినపూడి, అనంతవరం, ఇండ్లచెరువు, ఆరవల్లిపాడు, పెదన్నపాలెం, గుడిపాడు, గంగదేవిపల్లి, రామిరెడ్డిపల్లి, పోలేపల్లి గ్రామాల్లో రైతులు కంది పంటపై ఆధారపడి సాగు చేశారు.

తగ్గిన దిగుబడి

ఎకరాకు సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేలు ఖర్చు చేసి రైతులు కంది పంట సాగు చేశారు. తీరా దిగుబడి రెండు క్వింటాళ్లు మాత్రమే వచ్చింది.

మద్దతు ధర కల్పించాలి

గతంలో కంది పంట ఇళ్లకు చేరేలోపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటించారు. దీంతో దళారుల వ్యవస్థ కనుమరుగైంది. నేడు కొనుగోలు కేంద్రాలు లేవు. మద్దతు ధర లేదు. దీంతో గ్రామాల్లో దళారుల వ్యవస్థ పెరిగిపోయింది.

రైతులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. రైతులు పండించిన మిర్చి, పత్తి, కందుల ధరలు పూర్తిగా తగ్గిపోయాయి. ఎన్నికల ముందు రైతులకు మద్దతు ధర ప్రకటిస్తాం.. రైతుల సంక్షేమమే తమ ధ్యేయమంటూ వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తర్వాత రైతులను పూర్తిగా మరిచిపోయారని గ్రామాల్లోని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా న్యాయం జరిగేలా గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని అధికారులు చెప్తున్నారేగానీ ఆచరణ మాత్రం లేదు.

గిట్టుబాటు ధర కల్పించాలి



పది ఎకరాల్లో కంది పంట సాగు చేశా. లక్షన్నర రూపాయలు ఖర్చు చేశా. దిగుబడి మాత్రం 9 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. అమ్ముకోవాలంటే ధర లేదు. మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలి.

– నాగేశ్వరరెడ్డి, చిన్నగుడిపాడు

రేపు వేనూతల కాటమరాజు తిరునాళ్ల



వేనూతల కాటమరాజుస్వామి మూలవిరాట్



గంగాభవానీల మూలవిరాట్



అలంకరణలో బొల్లావు

పెద్దారవీడు: మండల పరిధిలోని గుండంచర్ల పంచాయతీ సమీపం నల్లమడ అడవిలో వెలసిన వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవానీల తిరునాళ్ల శనివారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయానికి రంగులు, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్ కోసం భారీ గేట్లు ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు అత్యంత నమ్మకంతో తిరునాళ్లకు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

పురాతన ఆలయం

13వ శతాబ్దంలో వేనూతల కాటమరాజు కనిగిరి ప్రాంతాన్ని పరిపాలిస్తుండే వారు. కనిగిరి సమీపంలోని పంచలింగాల కొండ దిగువన ఈయన కోట ఉండేది. కాటమరాజుకు విస్తారమైన పశుసంపద ఉండేది. అందుకే కాటమరాజు ఆవుల మంద కుదిరితే ఆరు ఆమడ, చెదిరితే పన్నెండు ఆమడ అనే సామెత ఏర్పడింది. తమ జీవ సంపదను బొల్లావుల ద్వారా కాటమరాజు కాపాడతాడని పశ్చిమ ప్రాంతం పశుపోషకులు, పాడి పరిశ్రమపై ఆధారపడిన ప్రగాఢంగా నమ్ముతారు. ఆలయంలో కాటమరాజు, గంగమ్మ, భవానీ దేవతల రాతి విగ్రహాలు, ఎదురుగా అతి పురాతనమైన ఒరగోగుమాను చెట్లు ఉన్నాయి. యాదవులు తమ జీవసంపదను బొల్లావుల ద్వారా కాటమరాజు రక్షిస్తాడని పశుపోషకుల ప్రగాఢ విశ్వాసం. ముఖ్యంగా ఈ ప్రాంతంలోని వారు ఎక్కువగా పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. నల్లమల అడవిలో నిర్మించుకున్న ఆశ్రమ ప్రాంతమే కాటమరాజు దేవాలయం దేవాలయం ప్రాంగణంలో ఆవుల మంద మంచినీటి కోసం కాటమరాజు తన త్రిశూలంతో కోనేటిని, వందలాది బావులను తవ్వినవేనని పెద్దలు చెప్పుకుంటారు. కాటమరాజు మరణించి దేవుడయ్యేడని ప్రజల విశ్వాసం. తమ పశుసంపదను బొల్లావు కాపాడుతుందని పశుపోషకుల నమ్మకం. పండగ రోజు తెల్లవారేలోపు దేవాలయం ప్రాంగణం అంతా నిర్మానుష్యంగా మారుతుంది.

నైవేద్యం చెల్లింపులో నేనంటే నేను..

వేనూతల కాటమరాజుస్వామి తిరునాళ్లలో శనివారం భక్తులు పొంగళ్లు తయారు చేసి స్వామి, అమ్మవార్లకు సమర్పిస్తారు. మొక్కుబడులు ఉన్న భక్తులు ఆలయం ప్రాంగణం చుట్టూ పొంగళ్లతో పాటు బొల్లావును నెత్తిన పెట్టుకొని తప్పెట్లు, కొమ్ముబూర ఊదుతూ ఆనందోత్సాహాలతో ఊరేగింపుగా తిరుగుతారు. మార్కాపురం మండలం గొట్టిపడియ గ్రామస్తులు, అర్ధవీడు మండలం మాగుటూరు గ్రామస్తులు దేవునికి పొంగళ్లు చెల్లించడంలో ఎవరు ముందు చెల్లించే విషయంలో పోటీలు పడతారు. ఆ సమయంలో భక్తులతో పాటు అధికారులు, పోలీసుల చూపు ఆ గ్రామస్తుల వైపు ఉంటుంది. అర్ధరాత్రి సమయంలో చివరి ఘడియల్లో కొలువు ముగుస్తుంది.

బొల్లావు తయారు

యాదవుల ఇలవేల్పుగా ఆరాధించి పూజించే బొల్లావును రెండున్నర అడుగుల ఎత్తులో తెలికైన కలపతో తయారు చేస్తారు. ఎరుపు రంగుతో అందంగా తీర్చిదిద్దుతారు. రెండు తొడలపై ఆంజనేయస్వామి, గరుత్మంతుడు, డొక్కకు సింహతలాటం, వీపున నాగబంధం, మూపురం (చెండు)కు ఇరువైపుల శంఖు, చక్రాలు, నొసటన గాంభీర్యాన్ని అందాన్ని చేకూరుస్తాయి. కొమ్ముకు వెండి గొడుగులు, చెవులకు, మెడకు ఆభరణాలు అలంకరిస్తారు. అలాగే బొల్లావుకు వీరతాళ్లు కడతారు.

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుల నియామకం



ఆవుల శ్రీధర్‌రెడ్డి,



యేలం మురళీకృష్ణ,



రవికుమార్, కొమరోలు



మానం బాలిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బేస్తవారిపేట: గిద్దలూరు నియోజకవర్గంలోని బేస్తవారిపేట, కొమరోలు, రాచర్ల మండలాలు, గిద్దలూరు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షులుగా పలువురిని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్టు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం పేర్కొంది.

బేస్తవారిపేట మండల అధ్యక్షుడిగా మోక్షగుండం గ్రామానికి చెందిన ఆవుల శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన భార్య ఆవుల అరుణమారి మోక్షగుండం సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు. ఈయన కుటుంబ సభ్యులే మోక్షగుండం పంచాయతీకి ఏడు పర్యాయాలు సర్పంచ్‌గా సేవలు అందించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రీధర్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

కొమరోలు: వైఎస్సార్ సీపీ కొమరోలు మండల అధ్యక్షుడిగా మేరుగ రవికుమార్ నియమితులయ్యారు. మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన రవికుమార్ గత ఏడేళ్లుగా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. రవికుమార్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా వెంకటరాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రవికుమార్‌ను జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు అభినందించారు.

రాచర్ల: వైఎస్సార్ సీపీ రాచర్ల మండల అధ్యక్షుడిగా మండలంలోని పలుగింటిపల్లె గ్రామానికి చెందిన యేలం మురళీకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రెండోసారి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గిద్దలూరు నగర అధ్యక్షుడిగా 13వ వార్డు కౌన్సిలర్ మానం బాలిరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం గిద్దలూరులోని ఆయన నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలిరెడ్డి మాట్లాడుతూ.. తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. నగర పంచాయతీలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, నాసరి శ్రీను, పోలేపల్లె శివ, గర్రె చిరంజీవి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, సూరేపల్లె రామకృష్ణ, గఫూర్, సునీల్‌రెడ్డి, నంద్యాల బాలు, గోడి వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, మిత్ర, బత్తుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో నిర్దేశించిన పనులు చేపట్టాలి

● డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

పొదిలి రూరల్: ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం నిర్దేశించిన పనులను మాత్రమే చేపట్టాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగవరపు జోసఫ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న మూడు నెలల్లో ప్రభుత్వం సూచించిన పంచ ప్రాధాన్యత అంశాలను పూర్తి చేయాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా 225 రైత్వారీ కుంటలు, రెండో ప్రాధాన్యతగా కాలువల్లో పూడికతీత పనులు, మూడో ప్రాధాన్యతగా మంచినీటి, ఇరిగేషన్ చెరువుల్లో పూడికతీత పనులు, నాలుగో ప్రాధాన్యతగా పశువుల నీటి తొట్ల నిర్మాణం, చివరగా ఒక్కో వ్యక్తికి సరాసరి కూలి రోజుకు 290 రూపాయలు వచ్చే విధంగా పనులు చేయించాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ సకాలంలో పని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రామాణాలు పాటిస్తూ, మస్టర్‌లో తప్పులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ లలితకుమారి, ఎంపీడీఓ శోభన్‌బాబు, ఏపీఓ టి.వెంకట్రావు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

మాజీ సైనికుల నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన మాజీ సైనికుల కార్యవర్గం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నియోజకవర్గ మాజీ సైనికుల జేఏసీ చైర్మన్‌గా కెప్టెన్ జి.సి.అంకన్న ఎన్నికయ్యారు. గురువారం మాజీ సైనికులు పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్లో సమావేశమై నూతన జేఏసీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్లుగా కోటారెడ్డి, సీహెచ్ లక్ష్మణ్‌బాబు, కన్వీనర్‌గా పసుపులేటి శ్రీనివాసులు, కో కన్వీనర్‌గా ఎస్.వెంకటేశ్వరరెడ్డి, సలహాదారుడిగా వేణుగోపాల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన జేఏసీ సభ్యులు మాట్లాడుతూ.. గిద్దలూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మాజీ సైనికుల సంఘ సభ్యులు శ్రీనివాసులు, పుల్లయ్య, పోలయ్య,వెంకటయ్య, గురువారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపయోగపడే పనులు చేయాలి



మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్‌కుమార్

దొనకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పనులు చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.జోసఫ్‌కుమార్ సూచించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో గురువారం సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో రాబోయే 3 నెలల్లో ఈ పథకంలో గ్రామ స్థాయిలో ప్రాధాన్యాలైన పశువుల నీటి తొట్టి నిర్మాణం చేపట్టడం, లక్ష్యం మేరక ఫారం పాండ్స్ నిర్మించడం, పంట కాలువలు పూడిక తీయడం, సాగు నీటి చెరువులు పూడిక తీయడం, కూలీలకు రోజూ సగటున రూ.290 నుంచి రూ.300లకు తగ్గకుండా ఉండేలా సిబ్బంది చూడాలన్నారు. రోజూ ఉదయం 6 నుంచి 10 గంటల్లోపు, సాయంత్రం 4 నుంచి 6 గంటల్లోపు పనులు ముగించుకోవాలన్నారు. వేతనాలు ఏ వారానికి ఆ వారం కూలీలకు చెల్లించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. 6 నెలలు పెండింగ్ బిల్లులు ఉన్నాయని, వెంటనే చెల్లించేలా చూడాలని ఏపీఓ దేవయ్యను పీడీ ఆదేశించారు. ఏపీడీ నిర్మలాదేవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఆదాం షఫీ, ఏపీఓ టి.దేవయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉగాది సప్తాహ వేడుకలు



లక్ష్మీ నృసింహస్వామి చిత్రపటం



సప్తాహ వేడుకల్లో పూజలు చేస్తున్న భక్తులు

కురిచేడు: స్థానిక శ్రీ కోనవల్లభరాయస్వామి కొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం ఉగాది సప్తాహ వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఏడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో తొలిరోజు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



చట్లమిట్లలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్లలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. మందిరంలో అర్చకులు సాయిబాబాకు అభిషేకాలు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి హారతులిచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో దాతల సాయంతో స్వామిని దర్శించుకున్న భక్తులకు, శ్రీశైలం వెళ్లే భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు



విద్యార్థులను అభినందిస్తున్న చంద్రమోహన్‌రెడ్డి

దర్శి: ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అవరోధిస్తారని రాజంపల్లి మల్లికార్జున హైస్కూల్ కరస్పాండెంట్ మేడం చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆ పాఠశాలకు చెందిన పి. మానస, ఎం.శ్రీవిద్యలు జాతీయస్థాయి నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్షలు రాసి సీట్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి గోల్‌ను ఎంచుకుని ఆ గోల్ సాధించే వరకు ఇష్టపడి శ్రమించాలన్నారు. కోచింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు



యువకుల సెల్‌ఫోన్‌లు చెక్ చేస్తున్న సీఐ రామారావు

దర్శి: క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని సీఐ రామారావు హెచ్చరించారు. యువత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆయన గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. టీస్టాళ్లు, టిఫిన్ సెంటర్‌లు, కళాశాలలు ఉన్న ప్రాంతాల్లో యువకుల సెల్‌ఫోన్‌ల్లో ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లు ఉన్నాయేమోనని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ యువతతో బెట్టింగులు చేయించినా నేరమని చెప్పారు. బెట్టింగ్‌లకు పాల్పడే వారి వివరాలు తమకు ఇస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు శ్రద్ధగా పరీక్షలు రాసి మంచి మార్కులు సంపాదించుకోవాలని సూచించారు. చెడు వ్యసనాలకు బానిసలైతే జీవితాలు నాశనం అవుతాయన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లు వేయడం అంటే తల్లిదండ్రులను మోసం చేయడమేనని చెప్పారు. బెట్టింగ్‌లు వేసే వారి సమాచారం ఇస్తే వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు.

ఆవుల యజమానులకు నష్టపరిహారం అందజేత

మార్కాపురం: ఇటీవల మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, పెద్దారవీడు మండలంలోని గుండంచర్ల బీట్ పరిధిలో రేచు కుక్కల దాడిలో మృతి చెందిన ఆవులు, దూడల యజమానులకు అటవీశాఖ తరఫున నష్టపరిహారాన్ని గురువారం మార్కాపురం అటవీశాఖ అధికారి కార్యాలయంలో రేంజ్ ఆఫీసరు వరప్రసాద్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగరాజు అందించారు. అడవుల్లో వణ్య ప్రాణుల వల్ల జంతువులకు గాయాలైనా, మృతి చెందినా తమకు సమాచారం అందిస్తే విచారణ చేపట్టి పరిహారం అందిస్తామని పేర్కొన్నారు. అటవీ అధికారుల అనుమతి లేకుండా అడవిలోకి ప్రవేశించడం, ఉచ్చులు, వలలు వేయడం, నిప్పు పెట్టడం లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొత్తం ఏడుగురు యజమానులకు రూ.2.48 లక్షల నష్టపరిహారం అందించినట్లు అధికారులు తెలిపారు.